

# సాంఘికగాథ

# మన రాజధాని

యం. యల్. [illegible]

ఇది తెలంగాణాలోపట ఒక జిల్లాలోపట ఒక వూరు. అవూరే నావూరు. నా పేరు పుల్లయ్య. అంటే పి. పుల్లయ్య లేసిన పిచ్చిపుల్లయ్యనుకోకండి. నా పేరు వట్టి పుల్లయ్య. నేను మావూరిమదర్సాలోపట్నే రెండో వాచకందాక తెలుగూ, బోర్డు జమాయిందాక ఉర్దూ చదువుకున్న. అంతకంటే ఎక్కువ నాకు చదువురాదు. ఆ జమానలమన రాజ్యాన్ని తురుక రాజు ఏలుతున్నడు. అందుకేనాకు తెలుగుకంటే తురుకమే సాఫ్‌గ వస్తది. కానిమీకు తురుకం రాదాయె! వచ్చినా నా కొచ్చినంతసాఫ్‌గ రాదాయె! ! అందుకని— తెలుగులోనే మీతోటిమాట్లాడుత.

నాకెన్నో రోజులనుంచి పట్నంలో నాకథని మీకుచెప్పాలని ఉన్నది. ఆ సందు ఇప్పుడు దొరికింది. అందుకనే నేను చెప్పుతుంట. మీరు గడ్‌బడ్ చేయకుండా వినుండ్రి. కాని "అడికెందుకు పోయినవ్? యాడినుంచి అక్కడి కొచ్చినవ్? వట్టి దొంగులు కొడుతున్నవ్? ....." అని మాత్రం నాకు యాష్ట తెప్పించకుండ్రి.

నేను రెండోది జమ్మ్యాట్ కాంగనే ఎక్కడన్నఏదన్న పని దొరుకుతదా అని చూసిన. కాని ఫాయిదా లేకుంటపోయింది. ఎట్లాగా, నేను ఎట్ల బతకాలె అని ఆలోచించుడు మొదలు పెట్టిన. అదే రోజుల్ల నా కిస్మత్ మంచిగుండబట్టి పట్నం (హైదరాబాదు)ల పనిచేస్తున్న మా మామ (అమ్మతమ్ముడు) మా యింటికొచ్చిండు. మా నాయినమాటల నడుమ మామతో నా గురించి చెప్పిండు. ఆయన మంచోడు కాబట్టి ఎట్లన్న కోశిశ్ చేసిపట్నంల నాకు కొలువు చూపిస్తనని మా నాయినతోటి చెప్పిండు. మా నాయిన మామతోటి నన్ను గనన్ను పట్నం పంపిచ్చిండు. నిజంగ నాది ఎంతమంచి తక్దీర్! లేకుంటే

( 44 - వ పేజీ చూడండి )



# మన రాజధాని

(21 వ పేజీ తరువాయి)

**పట్నంకు సొస్తైటీ బారంలంటున్న నేసేంది, పట్నాలు జరుకుటానికి పోవుడేంది!**

ఎట్లయితేంది నేమా, మా మామ తెల్లారి పొద్దుగాల రైళ్ళకెలి నాంపల్లి స్టేషన్ల దిగినం. మేము స్టేషన్లకెలి అవతలికొచ్చేవరకు అక్కడ రిక్షాలేవన్ని మూడు పయ్యాల సైకిల్లూ, మోటర్లూ కనిపించినై. ఇద్దరు ముగ్గురు మూడు పయ్యాల సైకిలోల్లు మా దగ్గరికొచ్చి "రిక్షా హోనాసాబ్?" అని అడిగిండ్రు. ! మా మామ "గౌలిపుర"కు తప్పానకు ఒక రిక్ష మాట్లాడిండు ఇద్దరం అందుల ఎక్కి కూసున్నం. సైకిలోడు ముందటెక్కి చలాయించుడు మొదలుపెట్టిండు మా రిక్ష ఒకహోటల్ ముందటిదాక పొయ్యి అక్కడ కుడిచెయ్యిదిక్కు తిరిగింది. ఇగ చూసుకో. అడ్నించి బుర్ బుర్ మంటూ మోటర్లూ, గణగణమంటూ సైకిల్లూ, "బాజూ", "చలావో" అంటూ రిక్షాగాళ్ళు..... అందరూ కలిసి రణగొణధ్వని చేస్తున్నరు. ఆ చప్పుడుల మా సైకిలింత చప్పుడు జేసుకుంట పోతుంది. నేను రోడ్డుకు రొండు దిక్కులున్న పెద్ద పెద్ద దుకాణాలనూ, బంగ్లాలనూ చూస్తున్న. మా మామ నాకు ఒక్కొక్కదాని చూపించుకుంట వాటి పేర్లు చెప్పుతున్నడు. ఇంతలోపట ఒక ఎరుపురంగు బంగ్లా వచ్చింది.

"దీనిపేరు 'గాంధీ భవనము' దీంట్ల డ్రామాలు జరుగుతయి. పెద్దోల్లు దీంట్ల లెక్చర్లిస్తరు" అని చెప్పిండు మామ.

ఇంతలోపట్లనే ఎడమ చెయ్యి దిక్కు ఒక జాగల ఇనుప సీకుల గోడమీద గిట్ల రాసున్నది. "ఇన్‌ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్." అరాత చెక్కలొట్టి చేసిండ్రట! మళ్ళ జర్ర సేపటికి రాంపతోటి కట్టిన ఒక పొడుగు బంగ్లున్న జాగను చేరినం.

"ఇది మోజంజాహిమార్కెట్"పలికిండుమామ.

"రిక్షా యింకా ముందుకు పొయ్యేవరకు "దీన్ని ఉస్మాన్‌గంజ్ అంటరు" అన్నడు మామ. ఆ గంజ్‌ల అందరు కోమటోల్లే ఉన్నట్లు అనిపించింది నాకు. మల్లా మామ "ఇది అఫ్జల్‌గంజ్" అనే వారకే ఒకపూలొచ్చింది.

"ఇదే 'నయా పూల్'." మామ మాట.

రిక్షా పూల్‌మీదికెలిపోతుంటే కింది యేరుమీది నుంచి చల్లటి గాలి వస్తుంది.

"దీనిపేరు మూసీనది"

నాకు చటుక్కున రెండో వాచకంల మూసిని గురించి చదివినట్లు యాదికొచ్చింది.

మామ చెప్పుతున్నడు : "ఇది 'సాలార్‌జంగ్ మ్యూజియం' ఇటు కుడిచెయ్యినుంచిపోతే సిటీ కాలేజీ, హైకోర్టూ వస్తయి"

ఇంతట్లోకే మా రిక్ష ఒక వానాచానా పెద్దగున్న నాలుగగోపురాలమసీదసొంటిదానితాని కొచ్చింది.

"ఇది 'చార్‌మినార్.' దీనిమీదికెక్కిచూస్తే పట్నమంత కనిపిస్తది; ఇగో 'యిది ఆయుర్వేద దవాఖాన' దీంట్లనే 'ఆయుర్వేద కాలేజుంది'; ఇదే మక్కామసీదు. పట్నం మొత్తంల పెద్దది" అంటూ కుడి దిక్కున ఒక రాతిబంగ్లను చూపిండు.

ఇంతట్లో సైకిలోడు యింక జర్ర ముందుకు పొయ్యి మలుపు తిరిగిండు.

"ఇది 'మొగల్‌పురా' అంటరు."

**రిక్షా యింకా** ముందటికిపోయి సుల్తాన మలుపు తిరిగి మళ్ళ వక్కగపోయి మల్లొక మలుపు తిరిగి ఒక కూరగాయుల మార్కెటు చేరుకున్నది.

"ఇదే 'గౌలిపురా మార్కెట్'...."

రిక్ష యింక జర్ర ముందటికి పొయ్యి ఆగింది. మేము దిగేసరికి రిక్షోడు పైసలు తీసుకొని పోయిండు. నేను మామ వెనుక నడుచుకుంటూ, సందులు తిరుక్కుంటూ యిల్లు చేరుకున్నం. మా అత్త లోపట ఏసొంటిదోగాని మీదికిమాత్రం నన్ను వాలొస్నే అన్నట్లు చూసింది. మేము భోజనాలుచేసి జర్రసేపు కుర్చీ లేసుకొని కూసున్నం.

మామ పదయ్యేటప్పుడు నన్ను పట్నం చూపెట్టుటానికి తీసుకపోతనన్నడు. నేను అమాంతం ఎగిరి దునికిన ఖుషితోటి. ఇద్దరం యింట్లకెలి బైటికెళ్ళి చార్‌మినార్ దాంక రిక్ష మాట్లాడుకున్నం. చార్‌మినార్ తాన ఆగంగానే "బారానా" యిచ్చి దిగినం. చార్‌మినార్ తాన్నే ఒక దిక్కు బస్సులాగే జాగున్నది. (అక్కడ రెండు బస్సులు ఆగి ఉన్నై) మే మిద్దరము ఒక బస్సుమీద బస్సున్న (డబుల్ డెక్కర్) బస్సు ఎక్కినం. నేను జల్ది జల్ది మీది బస్సుల కెక్కిన అరే! బంగ్లాలన్ని నా యెత్తే ఉన్నై. మనుషులందరూ చిన్న చిన్న భిలోనలున్నట్లున్నరు. సడక్‌మీద అటూ యిటూ పోతున్నరు. ఇంతట్లోనే బస్సు బుర్రమన్నది. పోనీకి కూడా శురుహైంది ఎటో చూస్తున్న నేను దబ్బున వక్కకున్న "తురుకమియ" మీదపడ్డ.

"క్యారె భై! అంఖేనహీందిఖ్ తారే!!" అను కుంటూ నామీద గుస్సైండు.

"మాఫ్‌కర్‌నా సాబ్ ఓ భోలా ఆద్మీహై," అన్నడు మామ "మియా" తోటి అప్పుడు జర్ర సల్లారిండు.

బస్సు పోతుంటే సడక్‌మీద నడిసే మోటర్లూ, సైకిల్లూ, మనుషులూ అందరూ మా బస్సుకిందనే పడుతండ్రా అనిపిస్తుంది.

మా బస్సు నయాపూర్‌ఎక్కింది. "అగో, ఆ కనిపించేదే "ఉస్మానియా దవాఖాన" అని చెప్పిండు ఇంకా చెప్పుతనే ఉన్నడు.

"ఇకడ్నించి అఫ్జల్‌గంజ్ రోడ్.....ఇక్కడ్నించి గౌలిగూడా; ఇగో ఇదే కోఠీ...."

కోఠీ అన్న జాగల బోలెడన్ని మోటర్లున్నై. ఒక మాల్‌గాడీ నిండే— ఆ డోల్లున్నరు. కుప్పల కొద్ది మొగోల్లున్నరు. వాళ్ళందరు అటూ యిటూ పోతున్నరు. ఒక కంపోండ్లకెలి రంగు రంగుల చీరల ఆడపిల్లలు వస్తున్నరు.

"అది వుమన్స్ కాలేజి....." మామ చెప్పిండు అదేంద్రా అని నేను సోంచాయించుతుంటే.

మా బస్సు మల్లా మలుపు తిరిగింది.

"ఇది సుల్తాన్ బజారు. ఈ రోడ్‌మీద అన్ని బేంకులే..."

బస్సు గడ్డ ఎక్కుతున్న ట్లనిపిస్తుంది. ఇంతట్లనే మామ చెప్పిండు.

"ఇగో ఈ టాకీస్ ఒక్కదాన్లోనే ఎప్పుడూ తెలుగు సినుమాలు తెప్పిస్తరు దీన్ని 'అబిడ్ రోడ్' అంటరు......' అనేవరకు గడియారాల దుకాణాలు, [illegible], [illegible] పుస్తకాల దుకాణాలూ, భిలోనల దుకాణాలూ ఉన్న పెద్ద రద్దిజాగొచ్చింది

"ఇది 'జనరల్ పోస్టాఫీసు'.... ఇది 'జ్రామోడ్ మహల్' టాకీస్... ఈ సందుంబడి పోతే మెడికల్ యిస్కూలూ, ఆల్ సెంట్స్ స్కూలూ వస్తదిక ....ఇగో ఇది గ్రామర్ యిస్కూల్..."

ఇంతల మోటరచ్చి ఒక ఒడే బడే పెద్ద బంగ్ల ముందట ఆగింది.

"ఇది హైద్రాబాద్ స్టేట్ బాంక్" అన్నడు మామ.

మేము అక్కడ బస్సు దిగినం. మామ నన్ను బేంకు పక్క నున్న సందు లోపట్నించి తీసుకపోతండు. అట్నుంచి నన్ను "బాగేఆమ్"కు తీసుకపోతనన్నడు. జర్రదూరం పొయ్యేవరకు ఒక ఆడి పిల్లల బడి వొచ్చింది. దానిపేరు స్టేన్లీ గర్ల్స్ యిస్కూలట! ఇంక జర్ర ముందుకు పొయ్యి కుడి దిక్కు తిరిగి యిస్కూలు గోడంబడి నడిచి ఒక సందులనుంచి దారి చూసుకున్నం. అది మమ్మల్ని బాగేఆమ్ (పబ్లిక్ గార్డెన్) తలుపు దగ్గరికి తీసుకపోయింది. ఆ గార్డెన్ లోపటికి పోయినం. వహ్వా! వహ్వా! ఎంత శాన్‌దార్ చెట్లు! ఎంత దిల్‌చస్పీ పువ్వులు!! ఎంతలా బహార్ చెరువు!!! అది నిజంగా పురానే జమానాలో 'రాజులతోట' ఉన్నట్లుంది. మేము యిట్ల మొదటి తలుపుకెలి చెట్లనూ, ఏనుగులనూ, జింకలనూ, కోతులనూ, బాతులనూ చూసుకుంట పొయ్యి అందునే వున్న "అసెంబ్లీ"ని (అంటే ఏందో నా ఎరుకలేదు) కూడా చూసినం. అసెంబ్లీపాసి రెండో తలుపులకెలి అవతలి కెల్లినం. చెప్పుటం మరిచిపోయిన అందున్న "హెల్త్ మ్యూజియం" (అంటే ఏందో ఎరుకలేదుగాని ఆ బంగ్లలడున్న మనుషుల బొమ్మలూ, జాయిల బొమ్మలూ, పెరుపుల బొమ్మలూ, కూరగాయల బొమ్మలూ చూసిన) చూసినం. "మంచి భోజనం చేస్తే బలము వస్తుంది. మనము ఆరోగ్యంగా ఉంటాము" అని చెప్పిండు అందున్న ఒక మనిషి.

మేము అవతలికి వచ్చినంక "అగో అది ఆకాశవాణి. అంద్లకెలే రేడియోలల్లకు పాటలు వస్తయి" అని ఎడమవైపు ఎదురుంగడున్న ఒక బంగ్ల చూపిండు.

మేము కొంచెంసేపు అడ నిలబడేవరకు ఒక బస్సు వచ్చింది. మేము దాన్ని ఎక్కినం. అది మేము పొద్దుగాల వచ్చిన దారెంబడి తీసుకపొయ్యి 'చార్ మినార్'కాడ దించింది. అక్కడినుంచి మల్ల రిక్ష మాట్లాడుకొని యింటి కొచ్చినం.

ఇట్ల పట్నం చూసి యిల్లు చేరుకున్నం. మొదటి రోజు ఆవిధంగా గడిచింది. ఆ తర్వాత ఎన్నో రోజులూ, వారాలు, నెలలూ సాల్లూ గుజారాయిం చిన్నై. వాటన్నిటి కథలు చెప్పే ఓపిక యిప్పుడు నాకు లేదు. చెప్పినా వినే ఓపిక మీకు లేదని నాకు తెలుసు( అని మీకు కూడ తెలుసునా?) మనకున్న యింలకంటే ఎక్కువైతే కథను ప్రింటుచేసే ఓపిక కంపినోల్లకు లేదు. అందుకని యిప్పుడింత చాలు. మల్లెప్పుడన్న నాకు రెస్టు దొరికితే చెప్పుత. ఇకవుంట! ఇంతసేపు 'సాఫ్' సవాల్లు ఏమి వెయ్యకుంట విన్నందుకు మీకు బహుత్ బహుత్ శుక్రియా!!